క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు: పట్టణంలోని సంజామల మోటు నుంచి మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక శాసనసభ్యుడు మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతోపాటు రెవెన్యూ అధికారులు హాజరు అవుతారన్నారు.

అర్బన్ ఎస్‌ఐగా సత్యనారాయణ

పులివెందుల : పులివెందుల పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అర్బన్ ఎస్‌ఐగా సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది ఎస్‌ఐ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య పరీక్షలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని పైడిపాలెం గ్రామంలో సోమవారం ఇంటింటికి వైద్య సేవలు అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బిదినంచర్ల పీహెచ్‌సీ డాక్టర్ ఖాజామొద్దీన్ బాలింతలకు, గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, పీహెచ్‌ఎన్ పద్మావతి, సీహెచ్‌ఓ పవిత్ర, ఏఎన్‌ఎం లక్ష్మీప్రసన్న, ఆశా వర్కర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



శానిటేషన్ అధికారికి సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శానిటేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నూర్‌బాషా బదిలీపై ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి వెళుతుండటంతో మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ , మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూర్‌బాషా సేవలు కొనియాడారు. అనంతరం కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

వేతనాల కోసం వినతి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసిన శాప్ ఎండీ హర్షవర్ధన్, తదితరులు

పులివెందుల : పులివెందులలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సోమవారం పులివెందుల నియోజకవర్గంలోని సబ్‌స్టేషన్‌ల్లో ఆపరేటర్లుగా పనిచేస్తున్న సిబ్బంది కలిశారు. ఈ సందర్భంగా వారు 8 నెలలుగా తమకు జీతాలు అందలేదని ఎంపీ దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు.

ఎంపీని కలిసిన శాప్ ఎండీ

సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని రాష్ట్ర శాప్ ఎండీ హర్షవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పులివెందుల పర్యటనకు వచ్చిన ఆయన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి జిల్లాలో క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన పలు విషయాలపై చర్చించారు.

కేసీ కెనాల్‌లో పూడికతీత పనులు

చెన్నూరు : ఉపాధి పనుల ద్వారా కేసీ కెనాల్ కాలువలో ఉన్న వ్యర్థాలు, పిచ్చి మొక్కలు, గాజు పెంకుల తొలగింపు పనులను సోమవారం ఉపాధి కూలీలతో చేపట్టినట్లు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పూడికతీత పనులతో కేసీ కెనాల్‌లో నీటి సరఫరా సజావుగా సాగి రైతులకు మేలు చేకూరుతుందన్నారు. చెన్నూరు కొత్త రోడ్డు మీద చేపల వ్యర్థాలు, కోళ్ల వ్యర్థాలు కేసీ కెనాల్ లో వేయకుండా చర్యలు చేపడతామని తెలియజేశారు.

కౌలు రైతుల సంఘం కమిటీ ఎన్నిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏపీ కౌలు రైతుల సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శిగా ఎదురు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వైవీ సుదర్శన్ రెడ్డి, వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా యానాదయ్య, మురళితో పాటు పలువురి ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పులివెందుల టౌన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుండి పాత ఆర్టీసీ బస్టాండ్ వద్దగల వైఎస్సార్ సర్కిల్ వరకు నిర్వహించారు. అనంతరం స్థానిక భాకరాపురంలో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, అన్ని సచివాలయాల అడ్మిన్లు, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, ఆనిమేటర్లు, లయోలా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థినులు, కళాశాల సిబ్బంది పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ సుధీర, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో..

పట్టణంలోని ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.భేగ్ విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలోనూ, వసతి గృహాల వద్ద మొక్కలు నాటి నీరు పోశారు.

ఆర్టీపీపీలో ర్యాలీ..

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఆర్టీపీపీ సీఈ టీ నాగరాజు ప్రారంభించారు. ఈ ర్యాలీ పవర్ హౌస్ గేటు నుంచి సర్వీసు బిల్డింగ్ వరకు చేపట్టారు. తర్వాత 130 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీలోని ఎస్ఈలు ఈఈలు, డీఈలు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



వేముల : సచివాలయం వద్ద మొక్కలు నాటుతున్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి, తదితరులు



పులివెందుల టౌన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

■ మండల పరిధిలోని జువారి సిమెంట్ ఫ్యాక్టరీలో ప్లాస్టిక్ కాలుష్య నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రలేఖన, ముగ్గుల పోటీలు, కవిత పోటీలు నిర్వహించి విజేతలకు ప్లాంట్ హెడ్ జీఎస్‌బీ రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

కమలాపురం : ప్రజలే స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల నుంచి ఎస్‌బీఐ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పర్యవరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నినదించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.పల్లా కృష్ణ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రదీప్ కుమార్, అశోక్ కుమార్, అయ్యవారు, నాగేంద్ర, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

వేముల : గ్రామాల్లో విరివిగా చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వేల్పుల గ్రామంలో సచివాలయ భవన సముదాయం వద్ద సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ బాబ్‌జాన్ పాల్గొన్నారు.

■ పర్యావరణ పరిరక్షణకు యూసీఐఎల్ విశేష కృషి చేస్తోందని యురేనియం ప్రాజెక్టు జీఎం ఎం.ఎస్.రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ ఫారెస్ట్ అధికారి నాగార్జునరెడ్డి, డీజీఎంలు రామకృష్ణ, సర్కార్, మైన్స్ డిప్యూటీ మేనేజర్ కమలాకరరావు, సీఎస్ఆర్ నవీన్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ మేనేజర్ రాజేష్, ఎస్పీఎఫ్ సీఐ డేవిడ్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

వేంపల్లె : ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని కళాశాల ప్రిన్సిపల్ సి.యోగాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు సతీష్, వినోద్, జిలాన్, షఫివుద్దీన్, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో మొక్కలు నాటుతున్న ఆర్టీపీపీ సీఈ నాగరాజు

13న బండలాగుడు పోటీలు

చక్రాయపేట : చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లె సమీపాన వెలసిన దశరథ మహారాజు ఆలయంలో ఈ నెల 12 నుంచి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని దశరథ మహారాజు ట్రస్టు చైర్మన్ దశరథ, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బరామయ్య తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా 12 సోమవారం ఉదయం సీతా రాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. 13న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతిగా రూ.40 వేలు, మూడవ బహుమతిగా రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు అందజేస్తామని చెప్పారు. ఉత్సవాల రెండు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు జేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అసైన్‌మెంట్ కమిటీలో ప్రాధాన్యత ఇవ్వాలి

పులివెందుల టౌన్ : ప్రభుత్వం నిర్వహించే అసైన్‌మెంట్ కమిటీలో దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ తొండూరు మండల కార్యదర్శి ఎం.మురళి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో తొండూరు మండల దళితులతో కలిసి ఆయన ఆర్డీఓ వెంకటేశులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సాగు భూములను అర్హులైన పేదవారికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బాబు, శివ, గంగయ్య, బాల నరసింహులు, రామాంజులు, తిరుపాలమ్మ, లక్ష్మీదేవి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

సింహాద్రిపురం : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ మహబూబ్ బాష అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పైడిపాలెం గ్రామ సచివాలయంలో ప్రజా స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ మహబూబ్ బాష హాజరై మాట్లాడుతూ గ్రామంలో జగనన్న ఇంటి నిర్మాణాలపై దృష్టి పెట్టి త్వరగా పూర్తయ్యేటట్లు చూడాలన్నారు. అలాగే వైఎస్సార్ బీమా ఏ ఒక్కరినీ వదలకుండా సర్వే రెన్యువల్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, ఆర్ఐ షేక్షా, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై దృష్టి పెట్టండి

ఎర్రగుంట్ల : సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వస్తున్న అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ అన్నారు. సోమవారం పట్టణంలోని రెండవ వార్డు సచివాలయంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయ ఉద్యోగులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణ పనులలో పెండింగ్ బిల్లుల మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల: సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

లింగాల : మండల పరిధిలోని పెద్దకుడాల గ్రామంలో సోమవారం ఎంపీడీఓ సురేంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా స్పందన కార్యక్రమానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పెద్దకుడాల సర్పంచ్ శ్రీదేవి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, చిన్నకుడాల సర్పంచ్ నాగేంద్రారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఏఓ రమేష్, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

పెండ్లిమర్రి : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని మాచునూరు, మాచునూరు హరిజనవాడ, కొత్తపేట, యారాసుపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుక వస్తే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మాచునూరు హరిజనవాడలో సీసీ రోడ్లు, విద్యుత్ లైన్లు, వీధిలైట్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ లైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు.



మాచునూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

నూతన సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్ ప్రారంభించిన ఎమ్మెల్యే, ఆర్టీసీ ఛైర్మన్

మాచునూరు గ్రామంలో రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ సెంటర్‌లను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, సీకెదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు ప్రారంభించారు.

■ ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, సర్పంచ్ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతోష్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, పుల్లారెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఆగ్రో కార్పోరేషన్ డైరెక్టర్ చావలి శివ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : ఆదిత్యా బిర్లా కంపెనీలో ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పులివెందుల మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు, పట్టణ ప్రజలకు ఈనెల 8వ తేదీన పులివెందులలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదిత్య బిర్లా ట్రైన్ టైలర్ కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని.. ఆసక్తిగల అభ్యర్థులందరూ హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు ఉదయం 9 గంటలకు తమ వ్యక్తిగత వివరాలతో కూడిన సర్టిఫికెట్స్ తీసుకరావాలన్నారు. ఈ జాబ్ మేళాకు 18 ఏళ్ల నుండి 32 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తిస్తుందన్నారు. అలాగే బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 77803 76816 అనే ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బహుమతుల ప్రదానం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురంలో ఎ.సంజీవ్‌కుమార్ నాయుడు జ్ఞాపకార్థం విజయ్‌కుమార్ నాయుడు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు సోమవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌ను అర్బన్ సీఐ రాజు ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో పైడిపాలెం-11 జట్టు విజయం సాధించింది. క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు రూ.40,116లు, టోర్నీ రన్నరప్ జట్టుకు రూ.20,116లు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,116ల నగదు బహుమతులతోపాటు కప్‌లు, షీల్డ్‌లను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ విజయ్‌కుమార్‌నాయుడు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ నాయుడు, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీ విజేతకు కప్, నగదు బహుమతిని అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ

పులివెందుల రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని రాగిమానుపల్లె సర్పంచ్ అనూష పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలపల్లె, రాగిమానుపల్లె గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకత గురించి మండల యూనిట్ ఇన్‌చార్జి వేమ నారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఓడీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సరస్వతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అధిక ఆదాయం

వేముల : అంతర పంటలు సాగుచేయడంవల్ల అధిక ఆదాయం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చాగలేరు గ్రామంలో రైతు నరసింహులు సాగు చేసిన కూరగాయల నమూనాను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉమాదేవి, సిబ్బంది వెంకటేష్, అంజనరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ సత్యనారాయణస్వామి కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

టీటీడీ వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆగమ శాస్త్ర పండితులు రాజేష్‌భట్టర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించి పెళ్లి పీటలపై కొలువు దీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పరామర్శ

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లెకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రామాంజనేయరెడ్డిని సోమవారం కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఇటీవల కడప పట్టణంలో గుండె ఆపరేషన్ చేయించుకొన్నారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే.. రామాంజనేయరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తసంగటిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రేనాటి శివారెడ్డి తుమ్ముడు ఆర్.విశ్వనాథ్‌రెడ్డి సోమవారం గుండె పోటుకు గురై మృతి చెందాడు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి కొత్తసంగటి పల్లె చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే ఇటీవల రేపల్లె గ్రామానికి చెందిన చావలి రవి, పుల్లీర్పు ఆనంద్‌లు రాయచోటి వద్ద పెట్రోల్ ట్యాంక్‌లో పడి ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: రక్తదానం చేయడంలో యువత ముందుండాలని, యువత ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డీఈఓ రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అబ్దుల్ రాయల కరీముల్లా రక్తదాన పత్రాలను విద్యాశాఖ కార్యాలయం వద్ద పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సంబంధిత కరపత్రాలను డీఈఓ రాఘవరెడ్డి, విద్యాశాఖ సిబ్బందితో విడుదల చేయించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలను నడుపుతున్నప్పటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచడం లేదన్నారు. మెను ప్రకారం ప్రతి విద్యార్థికి రూ. 30 మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 10 వేలు ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా, చాంద్‌బాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

డయేరియా వ్యాధిపై అవగాహన

వేముల : చిన్నపిల్లలకు వచ్చే డయేరియా వ్యాధిపై రెండు వారాలపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌ఓ గౌతమి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియా వ్యాధి వచ్చిన పిల్లలకు తప్పనిసరిగా 14 రోజులపాటు జింక్ అందించాలన్నారు. డయేరియా వ్యాధి రెండు, మూడు రోజులకు తగ్గకపోయినా కూడా జింక్ మాత్రలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఆశా వర్కర్ నాగలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : మండల పరిధిలోని తాళ్లపల్లె గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లులకు, గర్భవతులకు సోమవారం డయేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ స్వాతిసాయి డయేరియా వ్యాధి నివారణపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నిజాముద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా, సీహెచ్‌ఓ వెంకటరత్నం, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : డయేరియా నియంత్రణ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి ప్రజలకు డయేరియాపై అవగాహన పెంచాలని ఎర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు జోత్స్న తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని సబ్ కేంద్రాలలో డయేరియా నియంత్రణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల : డయేరియా నియంత్రణపై అవగాహన ఇస్తున్న డాక్టర్ జోత్స్న

తొండూరు : మండల పరిధిలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.ముంతాజ్ ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓఆర్ఎస్ ద్రావణం తయారీ, జింక్ ప్రాముఖ్యత తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. అనంతరం డయేరియా నివారణా పక్షోత్సవ కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు సుబ్రమణ్యం, సంపత్, పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, పీహెచ్ఎన్ సుభద్రమ్మ, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి టోర్నమెంట్‌కు అఫీషియల్‌గా జిల్లా క్రీడాకారుడు

లింగాల : లింగాల మండలం మురారి చింతల గ్రామానికి చెందిన సీనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు ఎ.నాగరాజు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు అఫీషియల్‌గా ఎంపికయ్యారు. ఈనెల 6, 7, 8వ తేదీలలో అనంతపురం జిల్లా ఆర్డీటీ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా నాగరాజు ఎంపికయ్యారని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ ప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కొండారెడ్డి, జాయింట్ సెక్రటరీ జేసునాథరెడ్డిలు తెలిపారు. ఈయన ఎంపికపట్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సీనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు నాగరాజు

ఉదారత చాటిన వైఎస్సార్‌సీపీ నేత

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ 34వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అలీ అక్బర్ ఉదారత చాటుకున్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం ఇద్దరు నిరుపేద ఆడపిల్లల పెళ్లి ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.30వేలు చొప్పున రూ.60వేలు అందజేశారు. ఈ సందర్భంగా అలీ అక్బర్ మాట్లాడుతూ పుట్టిన రోజు పేరిట పార్టీలు, డిన్నర్లు, కేకుల కోసం డబ్బు వృథా చేయడం కన్నా నిరుపేద యువతులకు ఆ డబ్బు ఉపయోగపడుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, చాక్లెట్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు సంక్షేమ పథకాలు అందించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్పీ ఆఫీసు, పోలీసుస్టేషన్లు, డీటీసీ కార్యాలయాల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి కోరారు.సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. నాలుగు వేల రూపాయల వేతనం తీసుకునే స్వీపర్లకు ప్రభుత్వ పథకాలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఎస్పీ ఆఫీసు, డీటీసీ కార్యాలయాల్లో 82 మంది పార్ట్ టైం స్వీపర్లు పనిచేస్తున్నారన్నారు. జగనన్న చేయూత, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌నాయకులు కామాక్షమ్మ, వెంకట సుబ్బమ్మ, మల్లేశ్వరి, సరస్వతి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.